# పంట కాలనీల ఏర్పాటు కీలక ముందడుగు

## • దేశమంతా ఇది ఆచరణీయం: ఎస్కే సింగ్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: వ్యవసాయరంగ అభివృద్ధి, రైతుల సంక్షేమానికి పంటకాలనీల ఏర్పాటు కీలక ముందడుగు అని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి అనుబంధ విభాగం "నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్ సర్వే అండ్ ల్యాండ్ యూజ్ ప్లానింగ్" డైరెక్టర్ డాక్టర్ ఎస్కే సింగ్ పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పంటకాలనీల ఏర్పాటు ఆలోచన అద్భుతమని, దేశమంతా దీన్ని అనుసరించాలని అభిప్రాయపడ్డారు. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వి.ప్రవీణ్‌రావు తన కార్యాలయంలో పంటకాలనీల ఏర్పాటు అంశంపై గురువారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఎస్కే సింగ్ సహా రాష్ట్ర వ్యవసాయశాఖ అదనపు డైరెక్టర్ విజయ్‌కుమార్, విశ్వవిద్యాలయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ జగదీశ్వర్, విస్తరణ సంచాలకులు డాక్టర్ రాజిరెడ్డి ఇందులో పాల్గొన్నారు. మండలాల వారీగా పంటల సరళి, ఉత్పత్తి, ఉత్పాదకతలపై మ్యాప్‌లు రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. లోతుగా చర్చించేందుకు ఫిబ్రవరి 5,6 తేదీల్లో విస్తృత స్థాయి కార్యశాల నిర్వహిస్తామని ప్రవీణ్‌రావు తెలిపారు. సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుని ఫిబ్రవరి నెలాఖరునాటికి తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని ప్రకటించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ ఉపకులపతి డాక్టర్ చిండి వాసుదేవప్ప, ఇతర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.